# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవడానికి ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **భారతదేశమంటే గ్రామాలేనని.. గ్రామాల్లో మహిళల అభివృద్దే సమగ్రాభివృద్ధి అని తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ రోజు నుంచి 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది.**

4. **తెలంగాణాలో నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**

5. **భారత అంతరిక్ష పరిశోదన సంస్థ – ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్‌వీ–సీ59 ప్రయోగం విజయవంతమైంది.**

==========================

రాష్ట్రంలో మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవడానికి ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిన్న ఆయన దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ ప్రక్రియను సులభతరం చేసే విధానాలు తెచ్చామని, నిధులు అందుబాటులో ఉంచామని తెలిపారు. అధికారులు, ఉద్యోగుల వైఫల్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదని, తేమ సమస్య పరిష్కారానికి సూచనలు కోరారు. జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు వివరాలను ప్రజలకు తెలియజేయాలని చంద్రబాబునాయుడు ఆదేశించారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ రోజు నుంచి 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. రాష్ట్రంలోని 17వేల రెవెన్యూ గ్రామాలలో ఈ సదస్సులు జరగనున్నాయి. మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్, రెవెన్యూ అధికారులు సదస్సులకు హాజరుకానున్నారు. జిల్లాల వారీగా ఏ గ్రామంలో ఏ రోజు సదస్సు నిర్వహించాలనే షెడ్యూల్‌ను ఇప్పటికే కలెక్టర్లు సిద్ధం చేశారు. జనవరి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచే సదస్సులు

నిర్వహించనున్నారు.

--------------------------

భారతదేశమంటే గ్రామాలేనని.. గ్రామాల్లో మహిళల అభివృద్దే సమగ్రాభివృద్ధి అని తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు.

హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి గవర్నర్ నిన్న ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గతంలో తాను తెలంగాణ చేనేతలకు వీరాభిమానినని, ప్రస్తుతం తెలంగాణ స్వయం ఉపాధి సంఘాలకు కూడా అభిమానినయ్యానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వేలకోట్ల రూపాయల విలువ చేసే శిల్పారామంలో దాదాపు మూడున్న ఎకరాల స్థలాన్ని తెలంగాణ మహిళలకు అప్పగించామని అన్నారు. తమ నైపుణ్యాలతో మహిళా శక్తి బజార్‌ను హైదరాబాద్‌కే తలమానికంగా మార్చాలని మహిళలకు ఆయన సూచించారు. మహిళల అభివృద్ధి కోసం ఆర్థిక భారమైనా.. భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

--------------------------

బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటి వరకు వెయ్యీ 66 కేసులు నమోదు చేశామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు కోటి ఇరవై టన్నుల బియ్యం అక్రమ రవాణా జరిగిందన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో ప్రాంతీయ పౌరసరఫరాల శాఖపై నిన్న జరిగిన సమీక్షలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ప్రజాపంపిణీ బియ్యం అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో ధాన్యం సేకరణ, సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొంటూ.

--------------------------

కృత్రిమ మేథ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఆంధ్రప్రదేశ్ వాస్తవ సమయ పరిపాలన.. ఆర్టీజీ శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు రావలసిన అవసరం లేకుండా వారికి అందుబాటులోకి ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టంచేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం.. షార్ నుంచి పీఎస్ఎల్‌వీ-సీ59 వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించారు. నిన్న సాయంకాలం 4 గంటల 4 నిమిషాలకు వాహకనౌక కక్ష్యలోకి ప్రవేశించింది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమ్‌నాథ్.. శాస్త్రవేత్తలను అభినందించారు. ఐరోపా అంతరిక్ష సంస్థ..ఈఎస్ఏకు చెందిన

ప్రోబా–3తో పాటు మరికొన్ని చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ–సీ59 వాహక నౌక ద్వారా ఇస్రో ప్రయోగించింది. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై పరిశోధనలు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ నెలలోనే స్పేటెక్స్ పేరుతో పీఎస్ఎల్వీ–సీ60 ప్రయోగం ఉంటుందని, ఈ ఉపగ్రహంతోనే ఆదిత్య ఎల్–1 సోలార్ మిషన్ కొనసాగుతుందని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.

---------------------------

కార్మికుల భద్రతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టంచేశారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో కార్మికుల రక్షణ, ఇతర అంశాలు, పరిశ్రమల శాఖపై సంయుక్త కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 24 వేల 642 కర్మాగారాలు ఉండగా, అందులో వెయ్యి 310 కర్మాగారాలు ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నాయని తెలిపారు. సుమారు 11 లక్షల 78 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని.. వారి రక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి సుభాష్ వివరిస్తూ..

వాయిస్ ( 37 సెకన్స్)

---------------------------

తెలంగాణాలో నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున గృహాలను కేటాయిస్తున్నామని.. నాలుగేళ్లలో రాష్ట్రంలో 4 లక్షల 50 వేల గృహాల నిర్మాణాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో నిన్న ఆయన, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి.. జూబ్లీహిల్స్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన 81 మంది పేదలకు రెండు పడకల ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఇళ్ల సర్వే కోసం అధికారులు వస్తారని, ప్రజలు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. తమ ప్రభుత్వం పేద ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పశ్చిమ గోదావరి, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో వర్షపాతం నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో అనేక ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కళింగపట్నంలో 20.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే 24 గంటల్లో రాయలసీమలో పలు ప్రాంతాల్లో, కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని అమరావతిలో భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో ఈ రోజు జరిగే డీప్‌టెక్ కాన్క్లేవ్–2024లో పాల్గొంటారు. స్థిరమైన మార్పు కోసం ప్రపంచ వేదిక..జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న డీప్ టెక్ ల్యాండ్‌స్కేప్‌లో వస్తున్న మార్పులు, సవాళ్లు, అవకాశాలపై ఇందులో చర్చిస్తారు.

---------------------------

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిన్న ఉదయం 8 నుంచి సాయంకాలం 4 గంటల వరకు కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లోని 92.62శాతం పోలింగ్ నమోదైంది.

======================